



టిడ్కో గృహ సముదాయంలో కమిషనర్ పరిశీలన



ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని వెంకటేశ్వర పురం టిడ్కో గృహ సముదాయాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టాలని, మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఎల్ అండ్ టి సంస్థ ప్రతినిధులు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులతో కలిసి స్థానిక టిడ్కో గృహ సముదాయాల ప్రాంగణాన్ని కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఇటీవల సిపిఎం బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. అక్కడ నెలకొన్న సమస్యలను, స్థానికులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తెచ్చింది. సమస్యలు పరిష్కారం చూపకపోతే ఉద్యమం స్తామని ఆ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో కదలిక రావడం గమనార్హం. స్వయంగా కమిషనర్ పరిశీలించి తగు చర్యలు ఆదేశించడం సిపిఎం ఆందోళనకు స్పందనగా భావించవచ్చు.

అప్పుడూ..ఇప్పుడూ..అంతేగా..!

- వైసిపి, టిడిపి దొందూదొందే
- ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా
- అధికారులు ప్రత్యక్ష సాక్షులే

అప్పుడు వైసిపి ప్రభుత్వం సహజవనరులను అడ్డూ అదుపు లేకుండా దోచేసింది. ఇసుక, మట్టి, గ్రావెల్ ఏది కనిపిస్తే దానిని అమ్మిసొమ్ము చేసుకుంది..ఇది అప్పుడు ఆపార్టీకి పెద్ద దెబ్బ. నూతన ప్రభుత్వం వచ్చాక అంతా మారిపోతుంది..అక్రమాలకు అడ్డుకట్టపడుతుంది..సహజవనరులు దోపిడీ ఆగిపోతుంది అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు..ఇప్పుడు అదే తంతు సాగుతుంది..మాఫియా ఇప్పుడు అధికారపార్టీ వైపు చేరడంతో మళ్లీ ఇసుక, గ్రావెల్ అక్రమరవాణా సాగిపోతోంది. ఇందుకు పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు సాక్షులుగా మిగులుతున్నారు. తాజాగా కోవూరు, కావలి, నెల్లూరు, సర్వేపల్లి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అధికారపార్టీ నేతల అండతో మాఫియా రెచ్చిపోతోంది..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నూతన ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు ఇసుక విధానం పూర్తిగా అందుబాటులోకి రాలేదు. ఇసుక కోసం వినియోగదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీగా ధరలు పెరిగిపోయాయి. ఎక్కడైనా పర్వాలేదు. మాకు ఇసుక కావాలనే వారికి ఇసుక మాఫియా అడ్డగోలు, అడ్డదిడ్డంగా సరఫరా చేస్తుంది. రాత్రి సమయాల్లో దొంగదెబ్బ కొడుతున్నారు. పోతిరెడ్డిపాళెం, పెనుబల్లి, నెల్లూరు, మర్రిపాడు, ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ నుంచి ఇసుక రవాణా సాగిస్తున్నారు. ఇదేసమయంలో మట్టిని తవ్వేస్తున్నారు. స్థానిక తహశీల్దారులపై ఒత్తిడి తెచ్చి, ఏదో అనుమతి తీసుకొని దానితో పనికానిస్తున్నారు. తాజాగా పెనుబల్లి ఇసుక రీచ్ నుంచి బుధవారం తెల్లవారుజామున కొందరు వ్యక్తులు ఇసుక అక్రమ రవాణ చేశారు. ఎపి 39యు, హెచ్ 6505 ట్రాక్టర్‌లో ఇసుక తరలిపోతుండగా సర్పంచ్ పెంచలయ్య అడ్డుకున్నారు. దీంతో ఇసుక మాఫియా రెచ్చిపోయి అతనిపై దాడిచేసి గాయపరిచారు. ఆయనను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. అంతకు ముందు బుచ్చిరెడ్డిపాళెం వద్ద తహశీల్దారు అనుమతి పేరుతో మట్టి తరలిస్తుండగా వివాదం జరిగింది. కోవూరు నియోజకవర్గంలో ప్రధానంగా ఇసుక, మట్టి మాఫియా చెలరేగిపోతున్నారు. అధికార పార్టీనేతలు కొందరు, వారి అండతో మరికొందరు విచ్చలవిడిగా అక్రమరవాణాకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. గత కొంత కాలంలో మీడియాలో వస్తున్నా ఏం చేస్తారో నేను చూసుకుంటా అంటూ



కసుపూరులో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

కొందరు అధికారపార్టీ నేతలు రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. గతంలో వీరు వైసిపి పార్టీలోనూ ఇదే తరహా వ్యవహారం శైలి నడిపారనే విమర్శలున్నాయి. సర్వేపల్లి నియోజకవర్గంలోని కసుపూరు బి-1, చవటపాళెం, ఎర్రగుంట తదితర ప్రాంతాల్లో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారపార్టీనేతల సిఫార్సులతో ఈ వ్యవహారం నడుస్తుండగా అధికారులు కాపలా కాస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.



పెనుబల్లిలో సర్పంచ్‌పై దాడి చేస్తున్న ఇసుక మాఫియా

కావలి నియోజకవర్గంలో బిట్రగుంట, బోగోలు, అల్లూరు ప్రాంతాల్లోనూ ఇదే వ్యవహారం సాగుతుందనే విమర్శలు న్నాయి.

అప్పుడూ..ఇప్పుడూ అంతేగా..!

గత ప్రభుత్వంలో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాలో ఎంఎల్‌ఎ నుండి కింద స్థాయి నేతలు, మాఫియాతో కలిసి పెద్ద ఎత్తున అక్రమ రవాణా చేశారనే విమర్శలు వచ్చాయి. పెద్దఎత్తున చెడ్డపేరు మూటగట్టుకున్నారు. సహజవనరులు దోచుకుంటున్నారనే పెద్ద ఎత్తున విమర్శలొచ్చాయి. మైనింగ్‌లోనూ అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అంతకన్నా భిన్నం ఏం కాదంటూ ప్రజలు విమర్శలు చేస్తున్నారు. కొందరు ఎంఎల్‌ఎల సపోర్టుతో ఇసుక, గ్రావెల్, మట్టి రాత్రి సమయాల్లో అమ్మేస్తున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే రవాణా ఉంటుందని అధికారులు చెప్పినా, రాత్రి సమయాల్లో పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇసుక , గ్రావెల్ తరలిపోతున్నా అధికారులు ఏం చేస్తున్నారో తెలియడం లేదు. అధికారులంతా నేతలు సిఫార్సులతో పోస్టింగ్‌లు తెచ్చుకోవడంతో ఒక్కరు నోరు మెదపడం లేదు. అధికారపార్టీలోని కొందరు పెద్దలు ప్రస్తుత పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు మళ్లీ చేస్తున్నారని, అప్పటి మాఫియా మళ్లీ ఇక్కడికొచ్చి చెలామణి అవుతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే ఇసుక, గ్రావెల్‌కు సంబంధించి మంచి విధానం తీసుకొచ్చి వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఏం చేస్తారో చూడాలి..



మాట్లాడుతున్న సాకే శైలజానాథ్

కాంగ్రెస్ నిరసన

నెల్లూరు : కూటమి ప్రభుత్వం పరిపాలన 100 రోజులు గడిచినా, గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ వాగ్దానాల ద్వారా గద్దెనెక్కిన ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను నిట్ట నిలువుగా మోసం చేస్తుందని మాజీ పిసిసి అధ్యక్షుడు సాకే శైలజానాథ్ విమర్శించారు. బుధవారం డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన' దాళిబజావ్'నిరసన కార్యక్రమం నిర్వహించారు. శైలజానాథ్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇంకా పిసిసి జనరల్ సెక్రటరీ అంబటి రామ కృష్ణ మాట్లాడారు. షేక్ ఫయాజ్ ,ఏటూరు శ్రీనివాస్ రెడ్డి, మీడియా ఇన్‌ఛార్జి కె సంజయ్ కుమార్ (అడ్వకేట్), గౌస్ బాషా మల్లి కిషోర్ రెడ్డి, షేక్ అల్లావుద్దీన్ , లీగల్ సెల్ సుధీర్,హుస్సేన్ భాష, శ్రీరాములు, దొంతాలి మోహన్ ఉన్నారు.



మంత్రి నారాయణకు చెక్కు అందజేస్తున్న వైద్యులు మాదాల వెంకటేశ్వరరావు, సుజాతమ్మ

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక పొగతోట ప్రాంతంలోని సమత నర్సింగ్ హోం వైద్య నిపుణులు మాదాల వెంకటేశ్వరరావు, డాక్టర్ సుజాతమ్మ "వరద బాధితుల సహాయార్థం రూ. లక్ష చెక్కును మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణకు అందజేశారు. బుధవారం మంత్రి నారాయణ నివాసంలో కలిసిన వైద్యులు ఆ చెక్కును అందజేశారు.

మాజీ ఎంపి మాగుంట పార్వతమ్మ కన్నుమూత

ప్రభుత్వ లాంఛనాలతో నేడు అంత్యక్రియలు - సిఎంతో సహా పలువురు సంతాపం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ పార్లమెంటు సభ్యులు ప్రముఖ వ్యాపార వేత్త కీర్తిశేషులు మాగుంట సుబ్బరామి రెడ్డి సతీమణి, మాజీ ఒంగోలు ఎంపి, మాజీ కావలి ఎంఎల్‌ఎ మాగుంట పార్వతమ్మ (77) బుధవారం తెల్లవారు జామున చెన్నయ్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా అనారోగ్యం ఇంటికే పరిమిత మయ్యారు. ఇటీవల ఆమెను చెన్నయ్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. నేడు ఆంత్యక్రియలు నెల్లూరులో నిర్వహిం చనున్నారు. ఆమె మృతికి సిఎం చంద్రబాబు నాయుడుతోపాటు పలువురు సంతాపం ప్రక టించారు.

మాగుంట పార్వతమ్మ (77) బుచ్చిరెడ్డిపాళెంలో జన్మించారు. బెజవాడ కుటుంబంలో జన్మించిన ఆమెను ప్రముఖ పారిశ్రామికవేత్త మాగుంట సుబ్బరామిరెడ్డి వివాహం చేసుకున్నారు. ఆమెకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో నక్సలైట్ల కాల్పుల్లో భర్తను కోల్పోయిన ఆమె ఇటీవల అనారోగ్యంతో కుమారుడు విజయబాబును కోల్పోయారు. కుమార్తె చెన్నయ్‌లో ఉంటున్నారు. అనారోగ్యంతో ఉన్న ఆమె, కుమారుడు మృతితో మరింత బహీనపడింది. కాంగ్రెస్‌పార్టీలో ఉన్న మాగుంట కుటుంబం 1996లో భర్త మరణాన ంతరం ఒంగోలు ఎంపిగా పార్వతమ్మ పోటీ చేసి గెలుపొందారు.



మాగుంట పార్వతమ్మ(ఫైల్)

2004లో కావలి ఎంఎల్‌ఎగా విజయం సాధిం చారు. బుధవారం మధ్యాహ్నం ఆమె భౌతికకా యాన్ని సరస్వతి నగర్‌లోని ఆమె నివాసానికి తీసు కొచ్చారు. నేడు మధ్యా హ్నం 4 గంటలకు అంత్యక్రి యలు నిర్వహిం చనున్నట్లు కుటుం బ సభ్యులు తెలిపారు.ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి ప్రకటించారు. కలెక్టర్ ఒ.ఆనంద్, ఎస్‌పి కృష్ణకాంత్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

సిఎం సంతాపం

ఒంగోలు మాజీ ఎంపి, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతికి సిఎం చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి పార్వతమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. పార్వతమ్మ ఎంపిగా, ఎంఎల్‌ఎగా విశేషసేవలందిం చారని కొని యాడారు. ఒంగోలు, నెల్లూరు జిల్లాల రాజకీయాల్లో మాగుంట కుటుం బానికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. దశాబ్దాలుగా ప్రజల అభ్యున్నతికి పాటుపడుతూ స్థానిక ప్రజలతో మాగుంట కుటుంబానికి విడదీ యలేని అనుబంధం ఉందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రులు ఆనం రామనా రాయణరెడ్డి, పి. నారా యణ , ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, జెడ్‌పి చైర్‌పర్సన్ ఆనం ఆరుణమ్మ, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఎంఎల్‌ఎలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కావలి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివా సులురెడ్డి, ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

మహీధర్‌రెడ్డి నివాళి

కందుకూరు : నెల్లూరులోని మాగుంట స్వగృహం లో కీ.శే. మాగుంట పార్వతమ్మ భౌతిక కాయానికి మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి నివాళులర్పించారు. పార్వతమ్మ అనా రోగ్యంతో మరణించిన విషయం తెలిసిన వెంటనే ఆయన నెల్లూరు వెళ్లి పార్వతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలో సిసి కెమెరాల ఏర్పాటు కోసం ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు బంగారు షాప్ యజమానులు బుధవారం విరాళాలు అందజేశారు. వి.పి.జి జ్యువెలర్స్ యజమాని వేముల సుకుమార్ గుప్తా రూ 50,000లు, సత్యసాయి జువెలర్స్ యజమాని కాకుమాని ప్రవీణ్ కుమార్ రూ 25000లు, వెంకటకష్ణ జ్యువెలర్స్ యజమాని ఆరికట్ల ప్రసాద్ రూ10,000లు, శ్రీ శ్రీనివాస



సిల్వర్ ప్యాలెస్ యజమాని చీదెండ్ల శ్రీనివాసులు అండ్ బ్రదర్స్ రూ 10,000లు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు కు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎంఎల్‌ఎ అభినందించారు.

'నూకసాని'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - లింగసముద్రం : ఎపి టూరిజం డెవలపమెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్‌నూకసాని బాలాజీకి మండలంలోని పలువురు టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మండల టిడిపిఅధ్యక్షులు వేముల గోపాలరావు,మాజీ ఎంపిపి గూడూరి కల్పనా రంగనాథ్, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బోడి సురేష్ యాదవ్, చిట్టిబోయిన సుధాకర్ యాదవ్, బచ్చు మాల్యాద్రి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత నిర్ణయాలకు కట్టుబడి పార్టీ అభివద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేసిన డాక్టర్ బాలాజీకి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గా నియమించడంతో ఆయనకు మంచి గుర్తింపు దక్కిందని టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందుకూరు 'ఎంవిఐ'గా రాంబాబు

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారిగా చెన్నూరి రాంబాబు ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌ఎసి)గా బాధ్యతలు చేపట్టినట్లు కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖాధికారి టి.వి. నాగ లక్ష్మీ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న రఫీ నెల్లూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంవిఐ గా పనిచేస్తూ ఉన్న చెన్నూరి రాంబాబు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.



రాంబాబు

వికలాంగుల పాఠశాలలో సందర్శన

ప్రజాశక్తి-కందుకూరు : స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలను సందర్శించడం చాలా సంతోషంగా ఉందని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ అన్నారు. పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయం కృషి వికలాంగుల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం ఆమె సందర్శించారు. పాఠశాలలోని అన్ని తరగతి గదులను పరిశీలించారు. ప్రతి విద్యార్థి వారి యొక్క మాసికనస్థితిని, ఆరోగ్యాన్ని గురించి పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. శ్రీ పూజ మాట్లాడుతూ స్వర్ణ స్వయంకషి దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ప్రేమతో కూడిన మంచి విద్యను అందిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులను సబ్ కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట వస్తువుల కిట్లను కరస్పాండెంట్ సుబ్బారెడ్డికి అందజేశారు. విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.పాఠశాల విద్యార్థులతో కలసి గ్రూప్ ఫోటో దిగారు. ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు,డాక్టర్ చంద్రశేఖర్ గుప్తా,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



29 ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-నెల్లూరు : కసుమూరు దర్గా గంధ, ఉరుసు మహోత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా ఎంఎల్‌ఎ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కసుమూరు గ్రామం లో ఈనెల 29వ తేదీ నుండి అక్టోబర్ ఒకటో తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే 247వ గంధ , ఉరుసు మహోత్సవాలను నిర్వహించేందుకు నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మలోల ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడారు.

కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో వసతులను మెరుగు పరిచి, వాహన చోదకులకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు.కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం సమీక్ష నిర్వహించారు.

వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలి

నెల్లూరు : ప్రభుత్వం జిఒ నెంబర్ 85ను రద్దుచేసి, పీజీ ఇన్ సర్వీస్ కోటాను పునరుద్ధరించి, డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు, జిల్లా జనరల్ సెక్రెటరీ కమల్ కిరణ్ కోరారు. ఈ మేరకు బుధవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు.

వీధి కుక్కల బెడద

ప్రజాశక్తి -నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మేయర్ స్రవంతి జయవర్ధన్ తెలిపారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని వెటర్నరీ విభాగాన్ని మేయర్ బుధవారం పరిశీలించారు. వీధి కుక్కల సమస్యకు పరిష్కారం చూపిస్తామని మేయర్ తెలిపారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసరు చైతన్య, వెటర్నరీ వైద్యులు మదన్ మోహన్ , శానిటరీ సూపర్వైజర్ సురేంద్ర ఉన్నారు.

మహోన్నత వ్యక్తి ఎస్‌పి బాలసుబ్రమణ్యం

- నగరంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వానికి మాజీ ఎంఎల్‌సి 'విటపు' సూచన
- పాటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



బాలసుబ్రమ్మణ్యం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

సినీ నేపథ్య గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం మహోన్నతమైన వ్యక్తి అని, ఆయన కాంస్య విగ్రహం నగరంలో ఏర్పాటు చేయాల్సిన అవసరముందని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వానికి సూచన చేశారు. బుధవారం స్థానిక 16వ డివిజన్, ఆదిత్య నగర్ పరిధిలోని ఎస్ పి బాలసుబ్రమణ్యం పార్కులో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పాటల పోటీలలో ప్రతిభ కనపరిచిన గాయకులకు నగదు బహుమతుల అందజేసే కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు వారి గౌరవాన్ని ప్రపంచ స్థాయిలో చాటిచెప్పిన మహోనత్నవ వ్యక్తి ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం అన్నారు. అటువంటి వ్యక్తి పేరుతో ఆదిత్యానగర్‌లో పార్కు ఏర్పాటు చేయడం, ఆ పార్కులో ఆయన 4వ వర్ధంతిని పురస్కరించుకోని కళాంజలి ఈవెంట్స్ అండ్ కూచిపూడి నాట్య కళాక్షేత్రం, ఆ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం బాల్యమిత్రులు, వి.ఆర్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ , పలువురు వ్యక్తులు ప్రసంగించారు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయిలో పాటల పోటీలల్లో ప్రతిభను కనపరిచి గాయకులకు నగదు పురస్కారాలు అందజేశారు. చివరగా చిన్నారులచేత నిర్వహించిన నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. ఎస్‌పి బాలసుబ్రమణ్యం పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బి రాజరాజే రాజేశ్వరరావు, కోశాధికారి జి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు సాంస్కతిక విభాగం కార్యదర్శి కళాంజలి శ్రీనివాస చక్రవర్తి, జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వంద రోజుల పాలనపై ప్రజలు సంతృప్తి : ఇంటూరి

ప్రజాశక్తి - లింగసముద్రం

కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో వందకు పైగా అభివద్ధి పనులపై దృష్టిపెట్టిన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అని, ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నారని ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. కోటయ్య సమాధి సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి అక్కడినుండి తహశీల్దార్ కార్యాలయం వరకు గుర్రం మీద ఎక్కి ఊరేగింపుగా వెళ్లారు. ప్రభుత్వ వంద రోజుల పాలనపై మాట్లాడారు..14 డ్వాక్రా సంఘాలకు 2.48 కోట్ల రుణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.తాహశీల్దార్ కార్యాలయంలో మొక్కలు నాటారు.తొలుత ఎంఎల్‌ఎ నాగేశ్వర రావుకు వెంగళాపురం గ్రామం దగ్గర కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ సీతామహాలక్ష్మి,మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాల రావు, మాజీ ఎంపిపి గూడూరి కల్పనా రంగనాథ్, పూరిమిట్ల బాలకోటయ్య, టిడిపి అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి కొణిదల శ్రీనివాసులు, టిడిపి నాయకులు రాజారపు మాలకొండయ్య,పూరిమిట్ల గురునాథం,గొర్రెపాటి సాంబయ్య, కూరపాటి శ్రీనివాసులు, సయ్యద్ నాయబ్ రసూల్ ఉన్నారు.



కరపత్రం అందజేస్తున్న ఎంఎల్‌ఎ ఇంటూరి

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి ఉలవపాడు : అక్రవంగా మద్యం బాటిళ్లను కలిగి ఉన్న పలువురుని ఉలవపాడు ఎస్‌ఐకె అంకమ్మ దాడి చేసి పట్టుకున్నారు. వారి నుంచి 93 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మోచర్ల గ్రామానికి చెందిన పచ్చిపాల వినోద్, కావలి మండలం ముసునూరు గ్రామానికి చెందిన అడపాల మనోజ్ కుమార్ ఉలవపాడు మండలం చాకిచెర్లలో ఉన్నత పాఠశాల వద్ద మద్యం అమ్మటానికి ప్రయత్నిస్తుం డగా వారిపై ఉలవపాడు పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. గోవా నుండి అక్రమంగా మద్యాన్ని నెల్లూరుకు చెందిన బుజ్జి అలి యాస్ అబ్దుల్ అజీజ్ అనే వ్యక్తి ద్వారా తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'..!

వలేటివారిపాలెం : మండలంలోని అయ్యావారిపల్లె అంకభూపాలపురంలో రైతు సేవ కేంద్రంలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షతన జరిగింది. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు ఆధు నిక వ్యవసాయ సాంకేతిక సమాచారాన్ని వ్యవసాయ అధికారుల ద్వారా తెలుసుకోవాలని సూచించారు..పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ పి వంశీ పశుసంవర్ధక శాఖ ద్వారా అమలయే పథకాల గురించి వివరించడం జరిగింది. అయ్యావారిపల్లి గ్రామ సర్పంచ్ డేగ వెంకటేశ్వర్లు, అమ్మపాలెం సర్పంచ్ చేనెబోయిన ఓబుల్ కొండయ్య, పిమోహన్ కుమార్, చెంచు శ్రీనివాసులు, ఎస్ కొండారెడ్డి , బి మోతుల ప్రసాద్ ఉన్నారు

గుడ్లూరు : రైతులు పండించుకున్న పంటలకి గిట్టుబాటు ధర లభించే వరకు మూడు నెలల పాటు ఉచితంగా తమ గోదాములలో నిలవ చేసుకోవచ్చు అని కందుకూరు ఎఎంసి వెంకటేశ్వర్లు రైతులకి విజ్ఞప్తి చేశారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు మండలం బసిరెడ్డి పాలెం, దారకంపాడు గ్రామాల్లో పంటలపై రైతులకు అవగాహన సదస్సు వ్యవసాయ అధికారి బి రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది.రైతులు పాల్గొన్నారు.

ఉలవపాడు: పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు కరేడు రైతు సేవా కేంద్రం లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కందుకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి. అనసూయ, కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ జి ప్రసాద్ బాబు, డాక్టర్ ఐ వెంకటేష్, డాక్టర్ జ్యోతి, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొని మాట్లాడారు.మండల వ్యవసాయ అధికారిని తిరుమల జ్యోతి శాఖ అధికారి మీ అధికారిని మీ జ్యోతి పశు పశు శాఖ డాక్టర్ నగ్మా, మత్స్యశాఖ అధికారి లక్ష్మణ్, అలగాయపాలెం టెంకాయ చెట్ల పాలెం రైతులు ఉన్నారు.



వలేటివారిపాలెంలో..

లైటు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి- కందుకూరు : ఎంఎల్‌ఎ ఇంటూరి నాగేశ్వరరావు సూచన మేరకు పట్టణంలో పెద్ద బజారులో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహ ఏర్పాటులో భాగంగా విగ్రహం వద్ద మెర్క్యూరీ లైటు ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ కె అనూషని కందుకూరు నగర ఆర్యవైశ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. త్వరలోనే పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మెర్క్యూరీ లైటును ఏర్పాటు చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. అందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి, కమిషనర్ అనూషకి ఆర్యవైశ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్ కుమార్, కోట వెంకటనరసింహ,బొగ్గవరపు సత్యనారాయణ, తాతా లక్ష్మీనారాయణ, కోట కిషోర్, చక్కా వెంకట కేశవరావు,గుర్రం అల్లూరయ్య, మురారిశెట్టి వెంకటేష్, మోదడుగు శ్రీనివాసులు,కంకణాల వెంకటేశ్వర్లు, దేసు శ్రీను, వేమూరి సుధాకర్ ఉన్నారు.

రక్తదాత రమేష్‌కు అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్య యువకుడు కనమల్లపూడి రమేష్ హైదరాబాద్ లో చిరంజీవి బ్లడ్ బ్లాంకులో బుధవారం 62వ సారి రక్తదానం చేశారు. పలుమార్లు మెగాస్టార్ చిరంజీవి రమేష్‌ను అభినందించాడు. రమేష్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి సేవా దక్పథంతో ఏర్పాటు చేసిన బ్లడ్ అండ్ ఐ బ్యాంకులో 62వ సారి రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన సొంత ఖర్చులతో మెగాస్టార్ చిరంజీవి బ్లడ్ బ్యాంకు పెట్టినప్పటినుండి నేటి వరకు 62 సార్లు రక్తదానం చేయడం తనకెంతో సంతోషంగా ఉందని అన్నారు. తన అభిమాన హీరో చేస్తున్న సేవా కార్యక్రమంలో ఉడతా భక్తిగా తాను రక్తదానం చేయడం ఎంతో సంతప్తినిచ్చిందని అన్నారు మెగాస్టార్ చిరంజీవి తరపున చిరంజీవి బ్లడ్ బ్యాంక్ అండ్ ఐ బ్యాంకు సీఈవో ఆర్ స్వామి నాయుడు రమేష్ ని అభినందించి ప్రశంసా పత్రం అందజేసి అబి.నందించారు. రమేష్‌ను కోకిల మ్యూజికల్ వరల్డ్ ఖాదర్ బాషా అభినందించారు.



ఎన్‌సిసి క్యాడెట్లు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు : ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఎన్.ఎన్.సి కాడేట్స్ గా మరో 25 మంది ఎంపికైనట్లు ఎన్.ఎన్.సి అధికారులు వెల్లడించారు. 2024-25 వ సంవత్సరానికి 25 మందికి ఖాళీలు ఉండగా 100 మందికి పైగా ఎంపికల్లో పాల్గొన్నారు. ఇందులో 8 మంది బాలికలు,17 మంది బాలురు ఎంపికయ్యారని కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ శ్రీనివాస్ తెలిపారు. ఎన్.ఎన్.సి ఆఫీసర్ 34 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మోహన్, సబ్ మేజర్ పుష్పరాజు, సుబేదార్ సంతోష్ సింగ్, హవల్దార్ పీతాంబర్ శ్రేష్ఠ,లు ఆధ్వర్యంవహించారు. ప్రకాశం ఎన్.ఎన్.సి ఆఫీసర్ హిమామ్ షా, సంతోష్ , కాలేజీ ఎన్.ఎన్.సి ఇన్ చార్జ్ ఎస్.ఎన్.మీరావలి పాల్గొన్నారు.




పిహెచ్‌సి వైద్యులు గిరీష్ మృతి

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లా, వైద్య ఆరోగ్యశాఖలో చేజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ గా సేవలందిస్తూ అనారోగ్య కారణాలతో డాక్టర్ నల్లగండ్ల గిరీష్ చిన్న వయసులోనే బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. వైద్యాధికారి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న పలువురు వైద్య ఆరోగ్యసిబ్బంది దిగ్భ్రాంతి చెందారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షులు చేజర్ల సుధాకర్ రావు జిల్లా జనరల్ సెక్రటరీ కమల్ కిరణ్ సంతాపం తెలిపారు. ఆ ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గేదెలు తరలింపు

ప్రజాశక్తి -నెల్లూరు : నగరంలో ప్రధాన రోడ్లమీద వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులను తరలించాలని, వాటి యజమానుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ, కమిషనర్ సూర్యతేజ ఆదేశాల మేరకు సంచార పశువులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వెటర్నరీ వైద్యుని నేతృత్వంలో రెండు బృందాలు స్థానిక ఆర్‌టిసి బస్టాండ్, పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కూరగాయలు మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న8 పశువులను కల్లూరుపల్లి గోశాలకు తలరించారు. శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మకు నివాళులు


నివాళులర్పిస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి

ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో బుధవారం మాజీ ఎంఎల్‌ఎ మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి ఎంఎల్‌ఎ కావ్య క్రిష్ణారెడ్డి ఘన నివాళులర్పించారు. కావలి ప్రజల అమ్మ మాగుంట పార్వతమ్మ మరణం రాజకీయ పార్టీలకు కావలి పట్టణ ప్రజలకు తీరని లోటన్నారు. నిత్యం కావలి పట్టణంలో ఎవరో ఒకరితో మమేకమవుతూ తన భావాలు పంచుకునేంత కావలితో మమేకమైంది పార్వతమ్మ జీవితమని పేర్కొన్నారు. తన రాజకీయ ఆరంగేట్రం మాగుంట పార్వతమ్మ దయే అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.రాజ్‌కుమార్ చౌదరి, గుత్తికొండ కిషోర్ బాబు, తిరువీధి ప్రసాద్, అరియా బేగం, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబురావు, పొట్లూరు శ్రీనివాసులు, బొట్లగుంట హరిబాబు, పల్లపు మోహన్, నాయుడు రామ్‌ప్రసాద్, బొంతా శ్రీనివాస్ యాదవ్, అక్కిలిగుంట సూర్యప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-బిట్రగుంట : మాగుంట పార్వతమ్మ మరణం రాజకీయ పార్టీలకు కావలి నియోజకవర్గ ప్రజలకు తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు లేళ్లపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావు పేటలోని తమ ఇంట్లో బుధవారం మాగుంట పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు లాలం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-విడవలూరు : పార్లమెంటు మాజీ సభ్యురాలు, వివాదరహితులు మాగుంట పార్వతమ్మ భౌతికకాయానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోవూరు ఎంఎల్‌ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు బుధవారం నివాళులర్పించారు. మాగుంట కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులున్నారు.



ప్రజాశక్తి-ఉదయగిరి : ఒంగోలు మాజీ ఎంపి, కావలి మాజీ ఎంఎల్‌ఎ మాగుంట పార్వతమ్మ మరణం రాష్ట్రాని పేద ప్రజలకు తీరని లోటని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి మాజీ జెడ్‌పి చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మరణంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉదయగిరి ప్రాంతానికి ఆమె చేసిన సేవలు ఎనలేనివని గతంలో ఆమె చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉదయగిరి, కావలి నియోజక వర్గాలతో పాటు ఒంగోలు జిల్లా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఆమె భౌతికంగా దూరమవడం అత్యంత బాధాకరమన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి నిర్వహించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా గ్రామంలోని వరి పొలాలను పరిశీలించారు. మధ్యాహ్నం పాతాళపల్లిలో సర్పంచ్ ఓబులరెడ్డి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : వ్యవసాయంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని మండల సీనియర్ టిడిపి నాయకులు వంటేరు జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బ్రాహ్మణ క్రాక-1, హనుమకొండ పాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి బి.శైలజ, పశు సంవర్ధక శాఖ, విద్యుత్ శాఖ, మార్కెటింగ్, ఎవిఎఒ లు ప్రసాద్, వైష్ణవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులందరూ తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పంచేడు, మినగల్లు గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి సురేందర్ రెడ్డి పాల్గొని రైతులందరికీ అవగాహన కల్పించారు. మండల మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎ.పొట్టెయ్య, మార్కెటింగ్ సూపర్‌వైజర్ రవిచంద్ర, పంచేడు గ్రామ సర్పంచ్ సూరా విజయలక్ష్మి, మినగల్లు సర్పంచ్, బొర్రు పూజిత, కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, విఎఎ ఇందుప్రియ, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని మహిమలూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల హాజరు పరిశీలించారు. 46మంది ఉపాధి వేతనదారులు గ్రామంలో ఊటకుంట పూడికతీత పనులను చేస్తుండగా ఎంపిడిఒ పనిని పరిశీలించి, రోజు వారు చేయాల్సిన కొలతలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్క వేతనదారు రోజుకు ఒక మీటరు వెడల్పు, రెండు మీటర్ల పొడవు, అర మీటర్ లోతు చొప్పున పని చేస్తూ ఉండడంతో ఎంపిడిఒ సంతృప్తి వ్యక్తం చేశారు. సాంకేతిక సహాయకులు తేజ, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

29న గంధ మహోత్సవాలు


మాట్లాడుతున్న ఆర్‌డిఒ మధులత

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎఎస్‌పేటలోని శ్రీ హజరత్ సయ్యద్ రహమతుల్లా నాయబ్ రసూల్ వారి ఉరుసు గంధ మహోత్సవం 29వ తేదీన నిర్వహించనున్నట్లు ఆర్‌డిఒ మధులత తెలిపారు. ఈ సందర్భంగా యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఎఎస్‌పేట దర్గా గంధ మహోత్సవాన్ని పురస్కరించుకొని అన్నిశాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ విదేశాల నుండి భారీగా భక్తులు వచ్చి ఎంతో ప్రత్యేకంగా జరిగే ఈ గ్రంథ మహోత్సవానికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె సూచించారు. ఉరుసు ఉత్సవాలకు డిఎస్‌పి వేణుగోపాల్ పర్యవేక్షణలో 250మంది సిబ్బంది 11మంది ఎస్‌ఐలు, నలుగురు సిఐలు బందోబస్తు నిర్వహిస్తారని సిఐ వేమారెడ్డి తెలిపారు. ఉత్సవాలకు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బస్సులు నడుపునున్నట్లు బియ్యం కరీమున్నీసా తెలిపారు. దర్గా లోపల ప్రత్యేక నీటి వసతి, శ్యామ్యానాలు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని ఇఒ మహమ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎఎస్‌పేట బస్టాండు వీరాపేరు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని సర్పంచ్ భర్త జిలాని భాషా కార్యదర్శి ఎస్థాని బాషా తెలిపారు. ఎంపిడిఒ శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశుధ్య పనులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించేందుకు సచివాలయ ఉద్యోగులును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్‌టిసి, ఫైర్, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, వైద్య శాఖ, విద్యుత్ శాఖ, ఎక్సైజ్ ఇతర అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-కావలి : జన విజ్ఞాన వేదిక కావలి పట్టణశాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల - కావలిలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎగ్జామ్స్ ప్రశ్నాపత్రాలను ఎంఇఒ-1 పి.గోవిందయ్య చేతుల మీదగా ఆవిష్కరణ చేసి ఎగ్జామ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.బి.నీరజ, ఫిజికల్ సైన్స్ టీచర్ మండవ వెంకట రమణయ్య, బయోలజీ టీచర్ సుమతి, కావలి పట్టణ జెవివి ప్రధాన కార్యదర్శి గాదిరెడ్డి హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : విద్యార్థులలో సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు వారిలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి శాస్త్రీయ ఆలోచన, పరిశీలన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి సైన్స్ అధ్యయనాన్ని ప్రోత్సహించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను జెవివి నిర్వహిస్తుందని మేధా స్కూల్ కరస్పాండెంట్ సుబ్బయ్య అన్నారు. బుధవారం ఆత్మకూరు పట్టణం, మండలంలోని జెవివి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టాలెంట్ టెస్ట్ పత్రాలను పాఠశాల కరస్పాండెంట్ సుబ్బయ్య, జెవివి నాయకులు మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సీనియర్ జెవివి నాయకులు షేక్.సంధాని, ఉపాధ్యాయులు గంగాధర్ ప్రశ్నాపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందజేశారు. మండల శాఖ కార్యదర్శి మల్లికార్జున, జిల్లా జెవివి ఉపాధ్యక్షులు హరికృష్ణ, రెడ్‌క్రాస్ అధ్యక్షులు సాదిక్ హుస్సేన్, రైతుసంఘం నాయకులు లక్కు కృష్ణప్రసాద్, కత్తర్ బాబు తదితరులున్నారు.

చోరీల నివారణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాలలో చోరీల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆత్మకూరు డిఎస్‌పి కె.వేణుగోపాల్ తెలిపారు. ఆత్మకూరు సర్కిల్ కార్యాలయ ఆవరణంలో బుధవారం డిఎస్‌పి బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేకచోట్ల చోరీలు జరుగుతున్నందు వల్ల కొత్త వ్యక్తుల సంచారం గమనిస్తే తమకు తెలియజేయాలని తెలిపారు. బ్యాంకర్లు బ్యాంకుల వద్ద ఎటిఎంల వద్ద ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఆంధ్రాకు కొత్తగా 112 ఏర్పాటు చేశారని అత్యవసర సమయాల్లో పోలీసులకు ఈ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిఐ జి.గంగాధర్‌రావు, ఎస్‌ఐ షేక్ జిలాని, బ్యాంక్ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-మర్రిపాడు


మాట్లాడుతున్న మూలి వెంగయ్య

పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లవోలు రెవెన్యూలోని తిక్కవరంలో భూములు లేని నిరుపేదలు ఎకరం, రెండు ఎకరాల్లో ముళ్ల చెట్లను తొలగించి సాగు చేసుకుంటున్న వారికి నోటీసులు ఇచ్చి వదలి వెళ్లాలని రెవెన్యూ అధికారులు అంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీడు భూములను సాగు చేసుకుంటూ బోర్లు వేసి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు కరెంట్ బిల్లులు చెల్లిస్తూ మిరప, పొగాకు, వరి లాంటి పంటలను పండిస్తున్నారని తెలిపారు. 20వ తేదీన తమను ఆ భూముల నుండి తొలగిస్తున్నా మని 15మంది రైతులకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. వేల రూపాయలు ఖర్చు పెట్టి చెట్లు, రాళ్లను తొలగించి చదును చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. భూ సీలింగ్ చట్టం ప్రకారం భూమి లేని పేదలకు ఆ భూములు సాగు చేసుకుంటే వారికి హక్కు కల్పించాలనే చట్టం ఉందన్నారు. చట్ట పరంగా ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్న రైతు పేరును అడంగల్‌లో సాగు చేసుకుంటున్నట్లు నమోదు చేయాలన్నారు. 20యేళ్ళ నుండి సాగు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు సాగు నమోదు చేయడం లేదన్నారు. భూమి మీద యేళ్ళ తరబడి సాగులో ఉన్నామని అధికారులకు చెప్పినా రికార్డుల్లో మీపేరు లేదని విఆర్‌ఒలు చెబుతున్నారన్నారు. తిక్కవరం గ్రామంలో అనేక సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న రైతులకు సాగు రాసి, ఎంజాయ్‌మెంట్ అందజేసి అడంగల్‌లో నమోదు హక్కులు కల్పించాలని కోరారు.

అనంతరం తహశీల్దారు స్వప్న వివరణ ఇచ్చారు. ప్రభుత్వ భూములను అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఉందన్నారు. కానీ ప్రభుత్వం పట్టాలు ఇచ్చేవరకు వేచి ఉండాలన్నారు. భూములను సాగు చేస్తూ ఆ భూములు తమకే వస్తాయని మండలంలో చాలా భూములు ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఒక్కొక్కరు 5ఎకరాలు ఆక్రమించి సాగుచేస్తున్నారని, భూ పంపిణీ వచ్చే సరికి భూములు లేని పేదలకు పంపిణీ చేద్దామంటే ఎకరం భూమి కుడా లేదన్నారు. అర్హులై ఉండి భూమి లేనివారు వినతిపత్రం ఇస్తే కలెక్టర్‌కు పంపి భూ పంపిణీ జరిగే సమయానికి వారికి పట్టాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సింగనపల్లి మాజీ ఎంపిటిసి రంతూ, హాజరత్తయ్య, రైతులు పాల్గొన్నారు.

పని దినాలు కల్పించకపోతే చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉపాధి హామీ పథకంలో అధికారులు, సిబ్బంది కూలీలకు నిర్దేశిత పనిదినాలు కల్పించకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మేకపాటి శక్తి భవనంలో ఉదయగిరి, దుత్తలూరు మండలాల ఉపాధి హామీ అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువ అవకాశం కల్పించాలని డెల్టా ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు పెద్ద ప్రాధాన్యత ఉండదని అక్కడ పనులు దొరుకుతున్నాయని మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, వరికుంటపాడు, సీతారాంపురం, దుత్తలూరు లాంటి మండలాలలో పనులు తక్కువ కాబట్టి ఎక్కువశాతం ఉపాధి పనులపైనే ప్రజలు దృష్టి పెడతారని అందుకోసం ఇచ్చింతంగా నిర్దేశించిన పని దినాలు కల్పించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన 100 రోజుల పనిదినాలలో కనీసం 50శాతం పనులు తగ్గితే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. రైతులకు అనుసంధానం ఉన్న చిన్న కుంటలు, వ్యవసాయ పొలాల చుట్టూ కందకాలు, అలాగే పండ్ల మొక్కలు సరఫరా నాటించే కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. గ్రామస్థులతో కలిసి పంచాయతీ పరిధిలో గ్రామ పరిసర ప్రాంతాల్లో ఏమైతే పనులు అవసరం ఉంటాయో అలాంటి పనులు చేపట్టాలని అక్కడే వారికి పని కల్పించాలని తెలిపారు. నెలరోజుల తర్వాత మళ్లీ సమీక్ష సమావేశం ఉంటుందని పురోగతిని పరిశీలిస్తామని, అనుకున్న పురోగతి సాధించలేని చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో జిల్లా పిడి శ్రీనివాసరావు, ఆర్‌డిఒ మధులత, ఎపిడి గాయత్రి, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ శ్రీనివాసులు, ఎపిఒలు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళులు



ప్రజాశక్తి-కావలి : పట్టణంలోని శివరామ సుబ్బయ్య భవనం (సిపిఎం కార్యాలయం) లో బుధవారం మాజీ ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ఓల్డ్ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు టివిఎంఎస్. ప్రకాష్ రావు అధ్యక్షత వహించారు. ఓల్డ్ ఎస్.ఎఫ్.ఐ నాయకులు డాక్టర్ బెజవాడ రవి కుమార్, అడ్వకేట్ కె.వి.శేషారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహన్ రావు ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. "ఇండియన్" అనే పదానికి సరైన నిర్వచనం సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఈ సందర్భంగా సీతారాం చిత్రపటానికి పూలమాలలేసి, ఘనంగా నివాళులర్పించారు. సభలో సిపిఎం నాయకులు టి.మాల్యాద్రి, పి.పెంచలయ్య, ఓల్డ్ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కె.హనీసారవ రెడ్డి, ఎం.జజీరాజులు, రాజేంద్ర, కిరణ్, పి.మాధవ, ఎం.మాల కొండారెడ్డి, జెవివి తోట వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ నాయకులు బి.శ్రీను, రైతు నాయకులు రావి మాల్యాద్రి, బలిజపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు మాట్లాడారు.

దయనీయంగా ఉదయగిరి దుస్థితి


మాట్లాడుతున్న కరాక అజయ్‌కుమార్

ప్రజాశక్తి-ఉదయగిరి

మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా.. ఉదయగిరి పరిస్థితి దయనీయంగా ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను బాగు చేసి నీళ్లు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఏ బడ్జెట్ సమావేశంలో కూడా ఇలాంటి రిజర్వాయర్లకు బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం బాధాకరమన్నారు. బండగానిపల్లి నుంచి ఉదయగిరికి వచ్చే ఘాట్ రోడ్డు 3 కిలోమీటర్లు ఇప్పటికీ పూర్తి కాలేదని ఆయన వాపోయారు. అలాగే గండవరం నుంచి ఉదయగిరి రోడ్డు పరిస్థితి చూస్తే 30 కిలోమీటర్లు వెళ్లాలి ఉంటే రెండు గంటల నరక ప్రయాణం చేయాల్సిందే అలాంటి పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కలెక్టర్, మంత్రులు ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పాలకులు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ పూర్తి చేయాలన్నారు. నాలుగు మండలాల సిపిఎం కార్యదర్శులు షేక్.వర్లీన్‌భాషా, జె మల్లికార్జున్, కె.రమణయ్య, రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, తిరుపతయ్య, షేక్.నాయబ్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న సర్వ్ ప్రాజెక్ట్ మేనేజర్ జె.రూత్‌విన్

హెచ్‌ఐవి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఎపి ఎయిడ్స్ నియంత్రణ విభాగం వారి ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సర్వ్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా బుధవారం పట్టణంలోని నెల్లూరుపాలెంలోని పొదుపు మహిళలకు హెచ్‌ఐవి ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఐవి ఎలా వ్యాపిస్తుంది.. ఎలా వ్యాపించదు.. చికిత్స గురించి రాకుండా జాగ్రత్తలు గురించి సర్వ్ ప్రాజెక్ట్ మేనేజర్ జె.రూత్‌విన్ తెలియజేశారు. అంతేకాకుండా ఆత్మకూరు ఏరియా హాస్పిటల్ ఐసిటిసి స్టాఫ్ ఎం.రామయ్య, చిట్టిబాబు, సర్వ్ స్టాఫ్ ఎం.పద్మ, హేమలత, కవిత, సునంద, మాలిని, రిజ్వానా, నూర్జహాన్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-విడవలూరు : పార్లపల్లి గ్రామ రోడ్లు అధ్వానంగా తయారై ఉండడంతో గ్రామంలోని టిడిపి తమ్ముళ్ల తాత్కాలిక మరమ్మ తులు రూపంలో మెయిన్ రోడ్లలో ఏర్పడిన గుంతలకు రబ్బిష్ తోలించి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఎన్నోయేళ్ళుగా అధ్వానంగా ఉన్న రోడ్లను ఎవరూ పట్టించుకోలేదని వర్షాకాలం వస్తే రోడ్లపై గుంతలు చెరువులు తలపిస్తూ తీవ్ర ఇబ్బందులుగా మారుతున్నాయన్నారు.

28న సిపిఎం పట్టణ మహాసభ

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణ సిపిఎం మహాసభ 28వ తేదీన పట్టణంలోని వి.శివరామ సుబ్బయ్య భవనం (సిపిఎం ఆఫీసు)లో జరుగుతుందని పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభకు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. పార్టీ సభ్యులు సకాలంలో ఉదయం 9 గంటలకు అందరూ హాజరు కావాలని కోరుతున్నామన్నారు.

పలుచోట్ల 'ఇది మంచి ప్రభుత్వం'



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్

ప్రజాశక్తి-వరికుంటపాడు : వరికుంటపాడు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, నమ్ముకున్న ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని ఎంఎల్‌ఎ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వరికుంటపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎతో పాటు ఆయన సతీమణి ప్రవీణ, మాజీ ఎంఎల్‌ఎ కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి హాజరయ్యారు. స్థానిక మండల నాయకులు ఆయనకు ఆయనకు పూలవర్షంతో బాణసంచా కాలుస్తూ, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో, జరిగిన భూదందాలు సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి నష్టపోయిన బాధితులకు న్యాయం చేకూర్చేలా చేస్తానని హామీనిచ్చారు. మండలంలోని పలు సమస్యలను మండల నాయకులు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా ఆ సమస్యలను అతి త్వరలోనే పరిష్కరించి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. గత రెండేళ్లుగా ఉదయగిరి నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని గ్రహించి తమ ట్రస్ట్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి పేదవానికి ఉచిత వైద్యం, నిరుద్యోగులైన మహిళలకు కుట్టు మిషన్ నేర్పించి, వారిలోని నైపుణ్యతను బయటికి తీసుకొస్తు న్నట్లు తెలిపారు. మండలంలో ఫ్లోరైడ్ ఎక్కువ ఉన్న గ్రామాలలో ప్యూరిఫైడ్ వాటర్ అందించే విధంగా నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మంచినీటి అందిస్తానని, పెద్దిరెడ్డిపల్లి గండిపాలెం చెంచురామయ్య ప్రాజెక్టు 5నెంబర్ పనులు ఊరికి తీర్థ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి దిశలో ఎన్నో అడుగులు వేసిందని, వంద రోజుల పాలనలో ప్రజలు నిర్భయంగా ఉన్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, మాజీ ఎంపిపి సుంకర వేంకటాద్రి, జెడ్‌పిటిసి రావెళ్ల నాగేంద్ర, తెలుగు యువత ముజ్జె లక్ష్మి నారాయణ, చంద్ర ఉమ మహేశ్వర రావు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, పొద మాధవ, వైస్ ఎంపిపి దేవనబోయిన మధు, నాదెండ్ల రాజా, నల్లగొర్ల వెంగళ రావు, ఆంద్రా నాగిరెడ్డి, షేక్. పీరయ్య, సుంకర రాధాకృష్ణ, ఎస్‌సి సెల్ అధ్యక్షులు లాభాన్, బిసి సెల్ అధ్యక్షులు కొండలరావు, జనసేన మండల అధ్యక్షులు రసూల్, బిజెపి మండల అధ్యక్షులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : మండలంలోని కరటంపాడు గ్రామంలో "ఇది మంచి ప్రభుత్వం" కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళి కన్నబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి దిశలో ఎన్నో అడుగులు వేసిందని, వంద రోజుల పాలనలో ప్రజలు నిర్భయంగా ఉన్నారన్నారు. సచివాలయం సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, మాజీ ఎంపిటిసి గార్లపాటి వేణుగోపాల్ నాయుడు, బిజెపి నాయకుడు ఉప్పులూరు నరసింహులు నాయుడు, గ్రామ సర్పంచ్ పూనుగుంట రేవతి, మాజీ సర్పంచ్ పఠాన్ సాబ్జాన్, షేక్ ఖాజా మొహిద్దీన్, షేక్ నజీర్, మర్దన్ సుభహని, జబ్బార్, పఠాన్ గౌస్ ఖాన్, కోసూరు చెన్నయ్య, ఉదయ్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని తిక్కవరంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలను అందజేస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడలకు అంటించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మాజీ మండల అధ్యక్షులు శాఖమూరి నారాయణ, మాడుపూరి చంద్రబాబు, సుబ్బారావు, జి.వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, శ్రీహర్ష, అచ్చయ్య, సతీష్, జి.శ్రీనివాసులు, మర్రిపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు సురేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పడుగుపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ ప్రశాంతి రెడ్డి ఇంటింటికెళ్లి 100 రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కోవూరు తహశీల్దార్ నిర్మలానంద బాబా, మండల అధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, జెడ్‌పిటిసి పార్వతి, నాయకులు కాటంరెడ్డి భరత్‌రెడ్డి, పడుగుపాడు పెంచలయ్య, జెట్టి మదన్‌రెడ్డి, బెజవాడ వంశిరెడ్డి, రాకి, లేగుంటపాడు సర్పంచ్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, వేగూరు సర్పంచ్ అమరావతి, ఎంపిటిసి నాగరాజు, తిరుమూరు అశోక్ రెడ్డి, జివి నాగరాజు, జమీర్, జహంగీర్, తదితరులున్నారు.



పోలీసులకు హెచ్‌ఎం కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఉదయగిరి : అప్పసముద్రం జెడ్‌పి హైస్కూల్‌లో దొంగలించిన సామగ్రిని తిరిగి అందజేసిన ఉదయగిరి పోలీసులకు అప్పసముద్రం హెచ్‌ఎం విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏప్రిల్‌లో రాత్రులు దొంగలు పాఠశాలలోని సామగ్రి దొంగలించారని వాటిపై సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శాఖంగా త్వరగా రికవరీ చేసి కోర్టు ద్వారా పాఠశాలకు దొంగలించిన సామాగ్రిని అందించడంపై పోలీసులకు విద్యార్థులతోపాటు యాజమాన్య కమిటీ ఎస్‌ఎంసి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాపోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజాపోరాటాలకు సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలని, అక్టోబరు 20,21 తేదీల్లో నిర్వహించనున్న నగర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం శెట్టిగుంట రోడ్డులోని వి.మాలకొండా రెడ్డి భవన్లో స్థానిక 53వ డివిజన్‌శాఖ మహాసభ నిర్వహించారు. ఈ మహాసభల ప్రారంభోత్సవానికి ముందుగా ఇటీవల మృతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మస్తాన్‌బీ, స్థానిక నాయకులు నక్క వెంకటేశ్వర్లు, బయన్న, సుబ్రహ్మణ్యం, మణి, రమేష్, దస్తగిరి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యాలు



ప్రజాశక్తి-కావలి : డాక్టర్ డి.ఆర్. విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలు బుధవారం డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో పద్మ విభూషణ్ "చెరుకూరి రామోజీరావు సాంస్కృతిక పోటీల ప్రాంగణం" జవహర్ భారతి ఎంఎం హాలులో శాస్త్రీయ, జానపద నృత్యాలు ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అందరిని ఆకట్టుకుని అలరించారు. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు డైరెక్టర్ మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా నల్లూరు లక్ష్మీ ప్రశాంతి, కొప్పురావూరి లక్ష్మీ గాయత్రి, నల్లూరు రామకృష్ణ వ్యవహరించారు. లెక్చరర్లు ఎం.శిరీష, అమరావతి తమ సేవలందించారు.

పలుచోట్ల 'స్వర్ణాంధ్ర విజన్ -2047'


ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని పొంగూరు కండ్రిక గ్రామ పంచాయతీలో స్వర్ణాంధ్ర-2047 విజన్ గ్రామసభ సర్పంచ్ గుర్రం మాధవి తిరుపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2047వ సంవత్సరంలో భారతదేశం 100 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటుందని తెలిపారు. ఆ సమయానికి, ఆధ్యాత్మిక సాంకేతిక పరిజ్ఞానాలు, జనసాంద్రతలో మార్పులు, ప్రపంచ స్థూల ఆర్థిక, సామాజిక చిత్రపటాల్లో విప్లవాత్మక మార్పులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు మెంబర్స్, మాజీ సర్పంచ్ సుబ్బమ్మ వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు మేకల శేషయ్య, తలచిరు సుబ్బరాయుడు, నెల్లూరు సుబ్బారావు, మండవ వెంకటేశ్వర్లు, మాదాల వెంకటకృష్ణయ్య, మేకపాటి వెంకటేశ్వర్లు, మూల రమణారెడ్డి, తిరుమలశెట్టి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : మండలంలోని ఉమామహేశ్వరపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర -2047 కార్యక్రమానికి సంబంధించిన గ్రామసభ పంచాయతీ కార్యదర్శి కృపామయి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృపామయి సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు గట్టాల సుబ్బయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర -2047 ప్రోగ్రామ్‌ను గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో పలగట్ల శ్రీనివాసులు రెడ్డి, టిడిపి టౌన్ ప్రెసిడెంట్ కృష్ణచైతన్య, సచివాలయం సిబ్బంది వెంకటప్రసాద్, నాయకులు దయాకర్, నజీర్, వెంకటేశ్వర్లు, ఖదీర్, పెంచలయ్య, ఇస్మాయిల్ ఉన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలందరూ సహకరించాలని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కన్నుమ నాయుడు పేర్కొన్నారు. బోగోలు పంచాయతీ కార్యాలయంలో బుధవారం జరిగిన స్వర్ణాంధ్ర -2047 గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ ప్యాట్రిక్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, బోగోలు సర్పంచ్ అనిత, విస్తరణ అధికారి జహీర్ భాషా, పరిపాలన అధికారి గోవిందరావు, మాజీ ఎంపిటిసి చిలకపాటీ వెంకటేశ్వర్లు, నాగరాజు, మహిళ నాయకురాలు అరుణమ్మ, ఎస్ఎస్ యాదవ్, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-జలదంకి : ప్రజల అభిప్రాయం మేరకే గ్రామాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యంగా ఉందని ఉదయగిరి నియోజకవర్గం టిడిపి రైతు సంఘం అధ్యక్షులు పూనూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అన్నవరం ప్రధాన గ్రామంలోని బ్రహ్మంగారి స్వామి ఆలయ ప్రాంగణంలో సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ అధ్యక్షతన స్వర్ణాంధ్ర-47 విజన్ డాక్యుమెంట్ గ్రామాభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎంపిటిసి కోర్శిపాటి మహాదేవరెడ్డి, యువ నాయకులు పూనూరు రామకృష్ణారెడ్డి, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో గుమ్మడి రమేష్, పంచాయతీ కార్యదర్శి రేవతి, ముచ్చాల మధు రెడ్డి, ముచ్చాల మనోహర్‌రెడ్డి, కాసు చెంచు నాయుడు, కంచి కృష్ణారెడ్డి, చేజర్ల రమణారెడ్డి, పూనూరు మహేంద్రరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, గోచిపాతల వెంకట కృష్ణయ్య, జ్యోతి వెంకట్రావు, మంద. రమణయ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మెరుగైన వైద్యమందించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిఎంఅండ్‌హెచ్ఒ పెంచలయ్య అన్నారు. స్థానిక మండలంలోని జొన్నవాడ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి హాజరు పట్టిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో విధులకు హాజరుకాని వారిపై మండిపడ్డారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అవంతి విధులకు ఎందుకు హాజరు కాలేదని సిబ్బందిని ప్రశ్నించారు. డాక్టర్లు సమ్మె విరమించుకొని విధులకు వచ్చేలోగా సిబ్బంది సమ పాలనలో ఉంటూ రోగులకు అసౌకర్యం కలగకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణం శుభ్రపరిచి తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతి, ఫార్మసిస్టు సురేఖ, హెడ్‌నర్స్ సువర్ణ, ల్యాబ్ టెక్నీషియన్ యాసీన్ అహ్మద్, అటెండర్ భాషా, తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడులో వర్షం

ప్రజాశక్తి -వరికుంటపాడు : వరికుంటపాడు మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కుండా పోతగా వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురవడంతో దాదాపు పది సెంటిమీటర్లు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇంతటి వర్షం పడడంతో మూగజీవాలకు సైతం నీరు లభిస్తుందని పశుపెంపకం దారులు అంటున్నారు.

'మన మంచి ప్రభుత్వం'

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇందుకూరుపేటలో టీడీపీ నాయుకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నాగేంద్ర బాబు విచ్చేసి టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అవలంభిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తూ టీడీపీ ప్రభుత్వం సాధించిన విజయాలను వారు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేంద్ర బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజలలో మంచి ప్రభుత్వం గా పేరుగాచిం దన్నారు. పేదప్రజలనీ దష్టిలో ఉంచుకుని అన్న క్యాంటీన్ లను ప్రారంభి ంచడం సంతోషకర మన్నారు. వెయ్యి రూపాయలు ఒకే సారి పింఛన్ పెంచి ఒక రోజు ముందే ప్రజలకు పంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈదురు మధు,మాదాల రమేష్ నాయుడు, షఫీ,భాస్కర్ నాయుడు, కందల ప్రసాద్,మధు సూదన్ రెడ్డి,వెంకటేశ్వర రెడ్డి, మగ్గం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చళ్ల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

పచ్చళ్ళ తయారీపై అదానీ ఫౌండేషన్ బుధవారం మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. వివరాల మే రకు...అదాని ఫౌండేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా కృష్ణ పట్నం ఫార్మ ర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అదాని కృష్ణపట్నం పోర్ట్ పరిసర గ్రామాల మహిళా సంఘ సభ్యుల కు గ్రామంలో పచ్చడి తయారీ శిక్షణ కార్య క్రమం నిర్వహించింది. ఈ మేరకు మామిడి, టమోటా పచ్చడిల తయారీపై శిక్షణ అందిం చబడింది. పచ్చళ్ళ త యారీలో నిపుణులైన శిక్షకులు పర్యవేక్షణలో సిద్ధాంత పర మైన అంశాలలోనూ మహిళలకు విలువైన మార్గద ర్శకత కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమం నిర్వహిం చడం పట్ల శిక్షణ పొందిన మహిళలు హర్షం వ్యక్తం చేశా రు. అదానీ ఫౌండేషన్ ద్వారా శిక్షణ ద్వారా కొత్త ఉపాధి అవకాశాలను అందించినందుకు అదాని ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



'వేములపాటి'కి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కలిగిరి

ఉదయగిరి నియోజకవర్గ వాస్తవ్యులు జనసేన పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటిఅజయ్ కుమార్ కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్‌గా ఎన్నికైనందునఆయనకు కలిగిరి మండల జనసేనా అధ్యక్షులు బండారు లక్ష్మి నారాయణ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నియోజకవర్గంలో ఇలాంటి పదవులు మరెన్నో పొంది నియోజకవర్గ ప్రజలకు సేవలు చేసి అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని కోరారు. ఈ పదవి రావడం కోసం సహకరించిన నాయకులు, కార్యకర్తలు శు భాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కోసూరి సురేష్ ఆరుమళ్ల మల్లికార్జున, పొన్నం నాగేశ్వరావు, కోసూరి సునీల్, షేక్ కరీం, నల్లతాటి శ్రీహరి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆంక్షలతో పోరాటాన్ని ఆపలేరు

ప్రజాశక్తి-కలిగిరి

ఆంక్షలతో మా పోరాటాన్ని ఆపలేరని ఆశావర్కర్ యూనియన్, ఎంఆర్‌పిఎస్, సిఐటియు నాయకులు అన్నారు. మండల కేంద్రంలోనీ ఆశా వర్కర్ యూనియన్, ఎంఆర్‌పిఎస్, సీఐటియు ఆధ్వర్యంలో ఐదవ రోజు నిరసన ధర్నా నిర్వహించారు. అధికారం ఉందని దళితులపై కక్ష్య సాధింపు చర్యలు తగవని, ఆశా వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. విజయలక్ష్మీ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు పందిట అంబేద్కర్ మాదిగ హెచ్చరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రావులకొల్లు ఆశా వర్కర్ పందిటి విజయమ్మ పై రాజకీయ వేధింపులతో ఆమెను విధులు నుంచి తొలగిం చడం దారుణమని మండిపడ్డారు,ఆమెను వెంటనే విధులకి తీసుకోవాలని లేదంటే ధర్నాను ఉదతం చేస్తామని పిలుపునిచ్చారు.



నిరసన తెలుపుతున్న ఆశావర్కర్ యూనియన్

ఇప్పటికైన జిల్లా ఉన్నాధికారులు స్పందించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఇక్కడ ఆపితే పోరాటం ఆగదన్నారు. ఈ పోరాటాన్నీ ఉదయగిరి నియోజవర్గం, జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని, ఆమెకు న్యాయం జరిగేంత వరకు పోరాటం కొనసాగిస్తామని ఆశా వర్కర్ యూనియన్,ఎమ్మార్పీఎస్. సీఐటీయూ. తోడుంగా నిలబడుతుందని తెలియజేశారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని దళిత మహిళకు విజయమ్మకు తగిన న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా.రావులకొల్లు సర్పంచ్ వెంగప్ప నాయుడు దళితులపై కక్ష సాధింపులు మాను కోవాలని, లేదంటే సత్తా ఏంటో చూపిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల ఇన్‌ఛార్జి గోచిపాతల ఆనందరావు మాదిగ, కలిగిరి, వింజమూరు మండల ఆశా యూనియన్ అధ్యక్షులు డి. మేరీ, ఎస్ కే గౌసియా, నూర్జాహాన్, పలు మండలాల ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చిన్నారుల చేయూత

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వర్షబీభత్సంతో అతలాకుతలమైన విజయవాడ వరద బాధితులను ఆ దుకునేందుకు మేమూ సైతం అంటూ చిన్నారులు ముందుకొచ్చారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని కోడూరు పంచాయతీ చెన్నపల్లిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయ వాడ లో వరదల వల్ల నిరాశ్యులైన వారికి తమ వంతు సహాయంగా 54 వేల 161 రూపాయలు అందజేశారు. విద్యార్థులు తమ తమ గ్రామాలలో ఉపాధ్యాయుడు ఫణికుమార్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. వరద బాధితులను ఆదుకొనేందుకు విద్యార్థులు తాము సేకరించిన విరాళాలను బుధవారం ప్రధానోపా ధ్యాయులు సాయిప్రసాద్ కు అంద జేశారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయులు సాయి ప్రసాద్ మాట్లా డుతూ వరద బాధి తులను ఆదుకో వడంలో చిన్నారులు ముం దుకు రా వడం అభినం దనీయం అన్నారు. బాల్యం నుం డే విద్యార్థుల్లో ఆపద ల్లో వున్న వారికి సహాయం చేయా ల ని ఆలోచన ఈ విరాళాలు సేకరించ డం ద్వారా నిరూ పించబడిందన్నా రు. వరద బాధితులకు చేయూత ఇ వ్వడంలో చెన్నపల్లిపాలెం పాఠశాల విద్యార్థులు జిల్లాకే ఆదర్శంగా నిలి చారని హెచ్ఎం సాయి కుమార్ పే ర్కొన్నారు. విరాళాలు సేకరించే వి షయంలో విద్యార్థు లను, వారి తల్లి దండ్రులను ప్రోత్సహించిన ఉపా ధ్యా యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏదేమై నా వరద బాధితులను ఆదుకొనే విషయంలో పసి మనసులు స్పందించిన తీరు ప్రశంసలను అందుకొంటోంది. కార్యక్రమంలో శ్రీనివాస్ ప్రసాద్, మో హన్, ఫణి కుమర్, రమణ ప్రసాద్, విద్యాధరి, వాణి, నళిని, బూదే వ మ్మ, జయమ్మ పాల్గొన్నారు.



విరాళాలు అందజేస్తున్న చిన్నారులు

స్వర్ణాంధ్ర సాధన సిఎం చంద్రబాబుకే సాధ్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

స్వర్ణాంధ్ర సాధన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మాత్రమే సాధ్యమని స్పాట్ విలేజ్ కమిటీ చైర్మన్, టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజవర్గం ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి తాళ్లూరు జీవరత్నం (జీవయ్య) పే ర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్లిఖార్జునపురం గ్రామ పంచయతీలో స్వర్ణాంధ్ర- 20 47 గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ, సో షల్ వెల్ఫేర్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు హాజర య్యారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ సీ ఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 సాధించాలన్న లక్ష్యం తో ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ మే రకు ప్రభుత్వం నుంచి అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మండల స్థాయిలో నివేది కలు రూపొందిం చి జిల్లా స్థాయి అధికారులకు పంప డం జరుగుతుందని జీవ రత్నం తెలిపారు. స్వర్ణా ంధ్ర- 2047 లక్ష్యాల ప్రణాళికలను అక్టోబరు 15వ తేదీ నాటికి సిద్ధం చేసేలా ప్రభుత్వం నిర్ణయిం చి ఒదన్నారు. ప్రతేడాది లక్ష్యంపై డాక్యు మెంటేషన్ తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో టూరిజం, టెంపుల్ టూరిజం, వ్యవ సాయ, ఉద్యాన, మత్స్య రంగాల అభివృద్ధికి ప్రణాళిక లు ఉంటాయని పేర్కొన్నారు. కళాశాలల్లో, పాఠశాలల్లో విజన్ ఆంధ్ర-2047పై విద్యార్థులకు పోటీలు కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర-2040 పోస్టర్ ను ఆవిష్క రించా రు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం చేప ట్టారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్త లు గ్రా మస్తులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ముదివర్తిలో గ్రామసభ

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని ముదవర్తి గ్రామంలో బుధవారం గ్రామ సభ వాడివేడిగా జరిగింది. గ్రామ ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేశారు. గ్రామంలోని మంచినీరు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రానున్న ది వర్షా కాలం దృష్టిలో ఉంచుకొని కాలువల్లో పూడిక తీయాలని, రోడ్లపై ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత వహించకపోతే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రధాన రోడ్లమీద వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులపై వాటి యజమానులు బాధ్యత వహించకపోతే కఠిన చర్యలు తప్పవని, వాటిని గోశాలకు తరలిస్తామని నగరపాలక సంస్థ వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్ మోహన్ హెచ్చరించారు. పురపాలక శాఖ మంత్రి డాక్టర్ నారాయణ, కమిషనర్ సూర్యతేజల ఆదేశాల మేరకు సంచార పశు వులను గోశాలకు తరలించే స్పెషల్ డ్రైవ్ లో భాగంగా రెండు బందాలు స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పాత మున్సిపల్ కార్యాలయం రోడ్డు, కూరగాయలు మార్కెట్ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న 8 పశువులను కల్లూరుపల్లి గోశాలకు బుధవారం తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్లపై సంచరించే పశువులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. పశువులను గోశాలకు తరలించి వాటి సంరక్షణ బాధ్యతలను నగరపాలక సంస్థ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుం దన్నారు. పశువుల యజమానులు వాళ్ల ప్రాంగణాలలోనే ఉంచుకోవాలని, రోడ్లపై వదిలితే తప్పనిసరిగా వాటిని గోశాలకు తరలిస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్ ను నగర వ్యాప్తంగా ప్రతిరోజూ నిర్వహించి సంచార పశు వులను తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పొలంబడి నిర్వహిస్తున్న అధికారి

అన్నదాత అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

అన్నదాతల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.రాజ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మాచ ర్ల వారిపాలెం, వరకవిపూడి గ్రామాలలో పొలం పిలు స్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఎంఏఓ వివి శిరీష రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ రాజ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వరి సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబ డులను సాధించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పొలం పిలు స్తోంది కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అనుబంధ శాఖలైన మ త్స్య శాఖ, మార్కెటింగ్ శాఖలు పాల్గొన్నాయి. ఆత్మ ప్రా జెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ డ్రోన్, డ్రమ్ సీడర్ వాడకం గురించి, పొలాలకు జింక్ ఆవశ్యకత గురించి వివరించా రు. వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్ కుమార్ పచ్చి రొట్టె ఎరువులు ఆవశ్యకత వరి రకాల గురించి వి వరించారు. వ్యవసాయాధికారి శిరీష రాణి వ్యవసాయా న్ని లాభసాటిగా మార్చుకోవడం కొరకు ఈ "పొలం పిలు స్తుంది" కార్యక్రమము రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రబీకి సమాయత్తమయ్యే రైతులు వి త్తన శుద్ధి తప్పక చేసుకోవాలని ఆమె సూచించారు. ఇ ఫ్కో మేనేజర్ నారాయణ నానో యూరియా, నానో డిఏ పి వాడకం గురించి తెలిపారు. మత్స్యశాఖ రిజిస్ట్రేషన్ గురించి తెలిపింది. ఈ సందర్భంగా రైతులను పొలంలో సమావేశపరిచి పొలాన్ని కలియదున్నడం గురించి,తీసు కోవలసిన జాగ్రత్తల గురించి, పచ్చి రొట్టపై ఆవశ్యకత గు రించి వ్యవసాయ అధికారులు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మాచర్లవారిపాలెం వీఏఏ విద్యాసాగర్, వరకవి పూడి వీఏఏ వైష్ణవి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నా రు.